క్లుప్తంగా

డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి సన్మానం

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డిని రోగులు, వారి సహాయకులు సన్మానించారు. గురువారం బిర్లా కాంపౌండ్‌లోని కృష్ణకాంత్ ప్లాజాలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసరావుపేటకు చెందిన నరసింహారెడ్డి, కర్నూలుకు చెందిన విశ్వేశ్వరయ్య, శంకర్‌రావు కుటుంబ సభ్యులు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి మాట్లాడారు. డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి చేసిన ఆపరేషన్ వల్ల పునర్జన్మ లభించినట్లయ్యిందని పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ గురువారం నగరంలోని ఆద్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కె.కె.పాలి క్లినిక్‌లలోని స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె స్కానింగ్ కేంద్రంలో రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల వారు రికార్డులు, రిపోర్టులు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, అలా చేస్తే పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



వస్త్ర వ్యాపారులకు సూచనలు చేస్తున్న సీఐ రామయ్యనాయుడు

కర్నూలు: వ్యాపార సముదాయాల్లో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వన్‌టౌన్ సీఐ రామయ్యనాయుడు వ్యాపారులకు సూచించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు.. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, ప్రతి దుకాణంలో ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు.

ఆన్‌డ్యూటీపై ఏడీఏ బదిలీ!



ఏడీఏ ప్రవీణ్‌ను సత్కరిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఎమ్మిగనూరు ఫామ్‌లో ఏడీఏగా పనిచేస్తున్న డాక్టర్ డి.ప్రవీణ్ బదిలీ అయ్యారు. ఈయన ఇక్కడ దాదాపు రెండేళ్లుగా పనిచేస్తున్నారు. ఈయన రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈయన ఆన్‌డ్యూటీపై గంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. డిప్యూటేషన్‌పై బదిలీ అయిన ఏడీఏ ప్రవీణ్‌ను జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ఘనంగా సత్కరించింది. అసోసియేషన్‌లో కీలక పాత్ర పోషించే ప్రవీణ్ కమిషనరేట్‌లో ఉంటే వ్యవసాయ అధికారులు ఎదుర్కొనే సమస్యలను సత్వరం పరిష్కరించే అవకాశం ఉంటుందని జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్, దస్తగిరిరెడ్డి తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు, ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 57 మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. డిగ్రీ పరీక్షలను 11, బీఈడీ పరీక్షలను 8 కేంద్రాల్లో నిర్వహించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. డిగ్రీ పరీక్షలకు 541 మందికిగాను 484 మంది హాజరుకాగా 57 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బీఈడీ పరీక్షలకు 108 మందికి 93 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 పాలసీ

కర్నూలు (సెంట్రల్): ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటినీ ప్రగతి పథంలో నడిపించి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జీరో పావర్టీ పీ-4 పాలసీని అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. ఆయన గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయా శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో జీరో పావర్టీ, ఎంఎస్ఎంఈ సర్వే, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో జీరో పావర్టీని సాధించే దిశగా ముఖ్యమంత్రి ప్రారంభించతలపెట్టిన పీ-4 (పబ్లిక్ పీపుల్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్) పాలసీ అమలుపై తీసుకోవాల్సిన చర్యలను సీఎస్ వివరించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరించడానికి పబ్లిక్ కన్సల్టేషన్ సర్వే నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే స్వర్ణాంధ్ర విజన్ - 2047లో భాగంగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఇందుకోసం నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు భూమిని గుర్తించాలని, ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ.. జీరో పావర్టీ పీ-4 పాలసీ అమలులో భాగంగా పబ్లిక్ కన్సల్టేషన్ సర్వే నిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వర్గాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అలాగే నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

పాఠశాలల బలోపేతానికి ప్రతిపాదనలు

కర్నూలు (సెంట్రల్): పాఠశాలలు బలోపేతమయ్యేలా ప్రతిపాదనలు ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పాఠశాలల బలోపేతం - రీ స్ట్రక్చరింగ్ అంశంపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కర్నూలు నియోజకవర్గ స్పెషల్ అధికారులతో, డిప్యూటీ విద్యాశాఖాధికారులతో, మండల విద్యా శాఖాధికారులతో కలెక్టర్ కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండల విద్యా శాఖాధికారులతో మాట్లాడుతూ.. విద్యా శాఖ రూపొందించిన గైడ్‌లైన్స్ ప్రకారం పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతం అయ్యేలా ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కర్నూలు నియోజకవర్గాలకు సంబంధించిన క్లస్టర్ల వారీగా పాఠశాలలు, విద్యార్థుల వివరాలను మండల విద్యాశాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, డీఈఓ శామ్యూల్‌పాల్, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల, డీపీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ మ్యాన్‌హోల్ మీకు కనిపించదా?



తెరచుకున్న మ్యాన్ హోల్‌ను చూపుతున్న కాలనీవాసి

కర్నూలు(సెంట్రల్): జొహరాపురంలోని రైస్‌మిల్ ఆఫీసు సర్కిల్ వద్ద నోరు తెరచుకున్న మ్యాన్‌హోల్‌ను ఒకసారి చూడాలని స్థానిక ప్రజలు మునిసిపల్ అధికారులు, కార్పొరేటర్లను కోరుతున్నారు. ఈ దారిలో రోజూ వందల సంఖ్యలో వాహనాలు, వేల సంఖ్యలో జనాలు రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. చాలా వాహనాలు, ప్రజలు ప్రమాదం బారిన పడ్డారని, మ్యాన్‌హోల్‌ను వెంటనే మూసి వేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థకు రూ.10 వేల విలువ చేసే పుస్తకాలను బహుకరించారు. దాత బెంగళూరుకు చెందిన సీఏ జి.సతీష్‌చంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్కకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. గ్రంథాలయానికి 30 పుస్తకాలు బహుకరించడంతో పాటు డీఎస్సీ, గ్రూప్స్, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ తదితర పరీక్షలకు సన్నద్ధమయ్యేవారికి రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను అందజేశారు. పాఠకులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రయోజకులు కావాలని సూచించారు. లైబ్రేరియన్ బాషా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న దాత సతీష్ చంద్ర

మద్యం అక్రమ రవాణాపై నిఘా

ఆలూరు రూరల్: అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మచ్చ సుధీర్ బాబు తెలిపారు. గురువారం ఆయన ఆలూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ తనిఖీ చేశారు. మద్యం షాపు నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గీత కార్మికుల మద్యం షాపు టెండర్ల ప్రక్రియ ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. గీత ఉపకులాలకు చెందిన వారు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మద్యం విక్రయాల్లో ఎమ్మార్పీపై మార్జిన్ 14 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత, ఎస్ఐ నవీన్ బాబు ఉన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ..

పత్తికొండ రూరల్ : పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను ఆ శాఖ ఎస్పీ సుధీర్‌బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఐ విశ్వేశ్వరరావుతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని మద్దికెరలో మద్యం షాపునకు ఈడిగ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శుక్రవారంతో గడువు ముగుస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు

జిలెటిన్ స్టిక్ పేలి వ్యక్తికి గాయాలు

పెద్దకడబూరు: జిలెటిన్ స్టిక్ పేలి వ్యక్తికి గాయాలైన ఘటన మండల పరిధిలోని మేకడోణ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి వివరాల మేరకు మేకడోణ గ్రామానికి చెందిన నారాయణస్వామి పొలంలో పెద్దపెద్ద బండలు, గుండ్లు ఉన్నాయి. వాటిని చదును చేసుకోవడం కోసం గత నాలుగు రోజులుగా జిలెటిన్ స్టిక్స్‌తో బండలను పగలగొట్టుతున్నారు. బుధవారం సాయంత్రం పనులు అయ్యాక మిగిలిన జిలెటిన్ స్టిక్, డిటోనేటర్‌ను అక్కడే కంపచెట్లలో ఒకచోట దాచి పెట్టి ఇంటికి చేరుకున్నారు. గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఇబ్రహీంతో పాటో మరో 8 మంది కూలీలు పొలం చుట్టూ ఉన్న కంపచెట్లు, ముళ్ల చెట్లను తొలగిస్తున్నారు. అందులో భాగంగానే తొలగించిన కంపచెట్లకు నిప్పుపెట్టారు. అయితే కంపచెట్లలో దాచి ఉంచిన జిలెటిన్ స్టిక్, డిటోనేటర్ పేలడంతో ఇబ్రహీంకు గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని ఆదోని ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



జిలెటిన్ స్టిక్ పేలుడులో గాయపడిన ఇబ్రహీం

కూటమి నేతల ప్రోద్బలంతోనే దాడులు

కర్నూలు (హాస్పిటల్): కూటమి పార్టీల నేతల ప్రోద్బలంతోనే గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు. ఆయన గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చేరుకుని.. ఈ నెల 1వ తేదీన సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి గ్రామంలో అధికార పార్టీ నేతల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బోయ తిమ్మన్న, వడ్డె మేకల రాముడును పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వచ్చే సర్పంచ్ ఎన్నికలను ఏకగ్రీవం చేసుకోవాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను బెదిరింపులకు గురిచేయాలన్న కుట్రలో భాగంగానే దాడులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నన్నూరు బేగ్, సంజీవనాయుడు వెంట ఉన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న సుభాష్ చంద్రబోస్

కూలిన నంద్యాల ఎంపీ కటౌట్

● తప్పిన ప్రమాదం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి సంబంధించిన భారీ కటౌట్ కూలిపోయే వరకు తొలగించకుండా నిర్లక్ష్యం చేసిన మునిసిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. గురువారం కటౌట్ కుప్పకూలిన ప్రాంతాన్ని డీవైఎఫ్ఐ నాయకులు సందర్శించారు. వారు మాట్లాడుతూ.. ఎంపీ కటౌట్ కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. అయితే కటౌట్ కూలి విద్యుత్ తీగలపై పడడంతో షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు పాడయ్యాయని, ఐదు గంటలపాటు పెట్రోల్ బంకును మూసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో చాలా చోట్ల నెలల తరబడి భారీ కటౌట్‌లు ఉన్నాయని, వాటిని మునిసిపల్ అధికారులు తొలగించకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఆయా కటౌట్‌లతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే మునిసిపల్ అధికారులు భారీ కటౌట్‌లను తొలగించకపోతే మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు.



బళ్లారి చౌరస్తాలో కూలిన కటౌట్

జరిగిన నష్టానికి ఎవరిది బాధ్యత ?

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం బళ్లారి రోడ్‌లోని ఎంజీబీ షోరూం ముందు ఏర్పాటు చేసిన ఎంపీ బైరెడ్డి శబరి కటౌట్ బుధవారం అకస్మాత్తుగా ఎలక్ట్రికల్ హెవీ టెన్షన్ లైవ్ వైర్లపై పడటంతో నష్టం వాటిల్లిందని ఎంజీ బ్రదర్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యాజమాన్యం వారు పేర్కొన్నారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రెస్‌నోట్ విడుదల చేశారు. కటౌట్ విరిగి పడటంతో ఎంజీబీ ఆఫీస్‌లోని కంప్యూటర్, సీపీయూలు, ప్రింటర్లు కాలిపోయి నిరుపయోగంగా మారాయని, ఎంజీ, హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ వద్ద డీయూ పంపులు ఫెయిల్ కావడంతో అమ్మకాలు నిలిపేసినట్లు పేర్కొన్నారు. అదృష్టవశాత్తు ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రజలకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. జరిగిన నష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

డైస్‌ను సందర్శించిన న్యాయమూర్తి



డైస్ గురించి తెలుసుకుంటున్న బి.లీలా వెంకట శేషాద్రి, పక్కన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం (డైస్)ను గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సందర్శించారు. ఆయనకు ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ శైలేష్‌కుమార్, మేనేజర్ ఇర్ఫాన్ డైస్‌లో 0- 18 ఏళ్ల వయస్సు గల పిల్లలకు అందించే వైద్యసదుపాయాల గురించి వివరించారు. పుట్టుకతో లోపం గల చిన్నారులకు, చెవి, కంటి, విటమిన్, మానసిక లోపం ఉన్న పిల్లలకు శిక్షణ పొందిన వైద్యులచే ఉచిత వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ.. లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లచే టీమ్‌లను ఏర్పాటు చేసి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఫిబ్రవరి 10 నుంచి 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి విభిన్న సామర్థ్యం గల పిల్లలు, చిన్న వయస్సులోనే ఆరోగ్య లోపాలు గల పిల్లలను గుర్తించి వారికి బాలల సత్వర చికిత్స కేంద్రం ద్వారా వైద్యసేవలు అందేలా చేస్తామన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, న్యాయవాది కరుణ జ్యోతి, పారా లీగల్ వలంటీర్లు, రాయపాటి శ్రీనివాస్, సుధ, హేమంత్, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీస్ అధికారులు జ్యోష్ణ, లక్ష్మి ఉన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని దిశ వన్ స్టాప్ సెంటర్‌ను, మహిళా ప్రాంగణాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. కార్యాలయాల రిజిస్టర్‌లను పరిశీలించి, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇక్కడ ఉన్న వారు లీగల్ సర్వీసెస్ యాక్ట్ - 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులన్నారు. ఆయనతో పాటు ఐసీడీఓ అధికారిణి జ్యోష్ణ తదితరులు ఉన్నారు.

మొదటి అదనపు జిల్లా జడ్జిగా భూపాల్‌రెడ్డి



జి.భూపాల్ రెడ్డి

కర్నూలు: కర్నూలు మొదటి అదనపు జిల్లా జడ్జిగా జి.భూపాల్‌రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది జూన్ నుంచి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇన్‌చార్జ్ జడ్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం రాష్ట్ర హైకోర్టు కర్నూలులో ఖాళీగా ఉన్న మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జిగా, ఏడవ అదనపు జడ్జిగా పనిచేస్తున్న భూపాల్‌రెడ్డిని బదిలీ చేయగా ఉత్తర్వుల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది నుంచి బాధ్యతలు స్వీకరించి కోర్టు విధులకు హాజరయ్యారు. ఇదిలాఉండగా శుక్రవారం ఫ్యామిలీ కోర్టు, మహిళా కోర్టు, పోక్సో కోర్టు జడ్జిలు బాధ్యతలు చేపట్టనున్నారు.

బెల్లం ఊట ధ్వంసం

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామ శివారులో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఊట బెల్లంను కోడుమూరు ఎక్సైజ్ పోలీసులు గురువారం పారబోశారు. గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమ మైనింగ్ రాళ్ల సీజ్

వెల్దుర్తి: మండలంలోని సర్పాపురం గ్రామ పరిధిలో అక్రమంగా తవ్వి తీసి ఉంచిన బండరాళ్లను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. గురువారం మైనింగ్ ఆర్ఐ సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. అక్రమ మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి నిలువ ఉంచిన 111 రాతి దూలాలను సీజ్ చేసి వీఆర్‌ఓ మౌలాలికి స్వాధీనం చేసినట్లు చెప్పారు. టీఏ బాలనాయక్ ఉన్నారు.

సమయపాలన పాటించాలి

గోనెగండ్ల: ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ భాగంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణి మంజరి, ఏఓ బాబు భాస్కర్, ఈఓఆర్డీ అనంతసేన పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థికి అభినందన



విద్యార్థి హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న రాయలసీమ యూనివర్సిటీ సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి హర్షవర్ధన్‌ను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అభినందించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ హర్షవర్ధన్ గురువారం వర్సిటీలోని వీసీ చాంబర్‌లో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పెరేడ్‌లో విద్యార్థి కె.హర్షవర్ధన్ పాల్గొని జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశాడన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

గోనెగండ్ల: ఫిషరిస్ వ్యాపారం చేసుకునేందుకు మినీ రిటైల్ అవుట్ లెట్ పథకం కింద ప్రభుత్వం సబ్సిడీ రుణాలను అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల తెలిపారు. గురువారం మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టులో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి డీడీ శ్యామల, ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీడీ శ్యామల మాట్లాడుతూ ఫిషరిస్ వ్యాపారం చేసుకునేందుకు త్రీ వీలర్, టు స్కూటీ కం ఐస్ బాక్స్, ఫోర్ వీలర్ వెహికల్, ఫిష్ రెస్టారెంట్ ఏర్పాటుకు సబ్సిడీ కింద రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే మ బోట్లు, వలలు కొనుక్కునేందుకు గాను రూ.30 వేలు అందిస్తుందన్నారు. ఇప్పటి వరకు జీడీపీ మత్స్యకారులకు 18మందికి వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఈ విజయ్ కుమార్, ఎంపీడీఓ మణి మంజరి, తహసీల్దార్ కుమారస్వామి, ఫిషరిస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజ్ సమస్యపై వినతి



విద్యుత్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 29వ వార్డు పరిధిలోని సవారి తోట కాలనీలో లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు సుధాకరప్ప, యేసు డిమాండ్ చేశారు. గురువారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఎలక్ట్రిసిటీ ఏఈ కవితకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా కాలనీలో లోవోల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇంట్లో ఉన్న బల్బులు పూర్తిస్థాయిలో వెలగడం లేదని, ఫ్యాన్లు, టీవీలు పనిచేయడం లేదన్నారు. రాత్రి పూట నిద్రలేక కాలనీ వాసులు జాగరణ చేయాల్సి వస్తోందన్నారు. అలాగే వీధిలైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదన్నారు. పరిశీలించి విద్యుత్ పూర్తి స్థాయిలో వచ్చే విధంగా మరో ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు మౌలాలి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా సరఫరా చేస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత తెలిపారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఎక్సైజ్ పోలీసు కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామ సమీపంలోని బంగారమ్మ ఆర్చ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా హుండయ్ కేఏ 37 ఎన్ 6819 నంబరు గల కారులో తరలిస్తున్న 10 బాక్సులు కర్ణాటక మద్యం (86.4 లీటర్లు) గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కర్ణాటక రాష్ట్రం గంగావతికి చెందిన రవి అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కారును సీజ్ చేసినట్లు సీఐ చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ నవీన్ బాబు, సిబ్బంది మాలవ్య, విజయ్ కుమార్, సోమేష్ పాల్గొన్నారు.